పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయ పడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యా యి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మం డలం జగ్గారం శివారు బూరుగుగుం పునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటు కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమ వారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతు న్నది. దీంతో ఏడుపాయల వన దు ర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసి వేశారు. కరీంనగర్ జిల్లా హుజూరా బాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడు గుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజు లుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలుకురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలను కుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

• ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూన్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్ల దాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత

గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.



డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

• తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరు వానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

రఘునాథపల్లి చెరువుకు హద్దులు ఏర్పాటు

చెరువును పరిశీలిస్తున్న అధికారులు

రఘునాథపల్లి, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని శనిగ చెరువుకు సంబంధిత అధికారులు మంగళవారం హద్దులు ఏర్పాటు చేశారు. చెరువు అక్రమణకు గురైందని గ్రామానికి చెందిన శాడ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు చెరువును సందర్శించి ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలించి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూమి కొలుతల రికార్డుల కార్యాలయ సంచాలకులు మన్నెం కొండల్ మాట్లాడుతూ చెరువు శిఖం అక్రమించడం నేరమన్నారు. ఎవరైనా శిఖం భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ గీత, నూకరాజు, మండల సర్వేయర్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా గంగిశెట్టి ప్రమోద్‌కుమార్

గంగిశెట్టి ప్రమోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

జనగామ, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఆగిరి వెంకటేష్, పర్యవేక్షకులు ఈరుకుల రామకృష్ణ తెలిపారు. మంగళవారం పార్శి కమల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నికలకు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా జైన రమేశ్, కోశాధికారిగా అయితా బుచ్చిబాబును జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు జొన్నల రాజేశ్వర్, మహంకాళి హరిచంద్ర గుప్త, నాయకులు పజ్జూరి గోపయ్య, పోకల లింగయ్య, పజ్జూరి జయహరి, అరుగుల శ్రీనివాస్, గట్టు వెంకన్న, బిజ్జల నవీన్, శర్విరాల ఉపేందర్, శ్యామ్ శెట్టి రవీందర్, బెజగం బిక్షపతి, శివకుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

పాలకుర్తి, సెప్టెంబర్ 24: నియోజకవర్గ కేంద్రమైన పాలకుర్తిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో పార్టీ శాఖ మహాసభ నిర్వహించారు. రాపర్తి మంజుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో నేటికీ జూనియర్, డిగ్రీ కళాశాల లేకపోవడం శోచనీయమన్నారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు తమ పిల్లలను పై చదువుల కోసం జనగామ స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు పంపాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా దుంపల విగ్నేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, నాయకులు నితిన్, సంధ్యారాణి, సంతోష్ పాల్గొన్నారు.

పాలకుర్తిలోని ఐలమ్మ భవన్ వద్ద జెండాను ఆవిష్కరించిన నాయకులు

ఓటరు నమోదు పారదర్శకంగా జరగాలి

- చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి
- జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషాతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్ల కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్‌ఎస్‌ఆర్), ఈఆర్‌వో నెట్ 2.0పై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలెక్టోరల్ అధికారి మాట్లాడుతూ వారం రోజులుగా నూతన ఓటర్ నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పనితీరు మెరుగుపడిందన్నారు. ఇప్పటి వరకు 90 శాతానికిపైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, ఈనెల 28 నాటికి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వొచ్చని, బలవంతం చేయరాదన్నారు. ఇంటింటి సర్వేకు సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలుపాలన్నారు. యాప్ వినియోగంపై బూత్ స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29లోపు పూర్తి చేయాలని సీఈవో అధికారులను ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన వారి ఓట్లు దగ్గరలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా సంబంధిత ఎన్నికల ఏఆర్‌వోలు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి ఓటరుకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా సంబంధిత జిల్లా అధికారులతో సమావేశమై ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. జనగామ, పాలకుర్తి, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గాల్లో బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి, ఓటరు జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులపై ఓటర్లకు వివరించాలన్నారు. మరణించిన ఓటర్లను తొలగించడం, ఫొటో గుర్తింపు కార్డుకు సంబంధించి సరిగాలేని ఫొటోలను సేకరించాలన్నారు. ఇంటి నంబర్, ఇతర సవరణ కోసం ఫారం-8 ద్వారా ఓటర్ల నుంచి తీసుకోవాలన్నారు. 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్టేషన్‌ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సందల్‌తో దర్గాకు వస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

సందల్ సమర్పించిన జనగామ ఎమ్మెల్యే పల్లా

జనగామ, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డులోని హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి రహమతుల్లా అలై చిల్ల ముబారక్ దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఊరేగింపుగా దర్గాకు చేరుకొని సందల్ సమర్పించి ఫాతిహా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు దయాకర్, జూకంటి లక్ష్మీ శ్రీశైలం, బీఆర్‌ఎస్ నాయకులు ఉల్లెంగుల సందీప్, మూల రవి, దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు మహమ్మద్ యాకూబ్ పాషా, ఇస్మాయిల్, సలీం, ఇక్బాల్, మహబూబ్ పాషా, జహంగీర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ పై బీఆర్‌ఎస్ నాయకుల విడుదల

దేవరుప్పుల, సెప్టెంబర్ 24: మండలంలోని చినమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వంగ అర్జున్, గొడుగు మల్లికార్జున్లపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు కేసులు పెట్టించిన నేపథ్యంలో ఇద్దరు జైలుకు వెళ్లారు. కాగా మంగళవారం వీరికి జనగామ కోర్టు నుంచి బెయిల్ లభించడంతో జైలు నుంచి సాయంత్రం విడుదలయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై కాంగ్రెస్ నాయకులు అక్రమంగా కేసులు పెట్టించారని తెలిపారు. తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్నారు. బెయిల్‌పై విడుదలైన వీరికి మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరాంరెడ్డి, రాయపర్తి మండల నాయకుడు బిళ్ల సుధీర్‌రెడ్డి, దేవరుప్పుల మండల నాయకులు ధరావత్ రాంసింగ్, కొల్లూరు సోమయ్య, చింత రవి, కారుపోతుల భిక్షపతి, కోతి ప్రవీణ్, ఆలకుంట్ల యాదగిరి,మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, రాజన్న, కృష్ణమూర్తి, వంగ వెంకన్న, మేడ సోమనర్సయ్య, గేమానాయక్, మాజీ ఎంపీటీసీ గొడుగు సుజాత, నవీన్‌నాయక్, కొండాజీ,విద్యాసాగర్, తాటిపల్లి మహేశ్, ఆనంద్, కాడబోయిన యాదగిరి, వెంకన్న, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు,

బెయిల్‌పై విడుదలైన వారితో బీఆర్‌ఎస్ నాయకులు

బచ్చన్నపేటలో పాల్గొన్న జడ్పీ సీఈవో సరిత, డీపీవో రామారావు

అమ్మ కంటే కమ్మనిది అంగన్‌వాడీ కేంద్రం

జడ్పీ సీఈవో సరిత, డీఏవో రామారావునాయక్

బచ్చన్నపేట, సెప్టెంబర్ 24 : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి అమ్మ కంటే ఎక్కువగా చూసుకునేది అంగన్‌వాడీ కేంద్రమని జడ్పీ సీఈవో సరిత అన్నారు. పోషణ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిం చారు. సూపర్‌వైజర్ మనోహర, జిల్లా వ్యవసా యాధికారి రామారావునాయక్ , ఎంపీడీవో మల్లికార్జున్, ఏపీఎం నాగేశ్వర్‌రావు పాల్గొనగా ఆమె మాట్లాడారు. ఇంట్లో దొరకని పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రంలో లభిస్తున్నదన్నారు. మూడేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిం చాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అంకితభావంతో పని చేయాలని ఆమె సూచించారు. అనంతరం 30 మంది మహిళలకు బీఆర్‌ఎస్ నేత, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకట్‌రెడ్డి చీరలను అందించారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, డాక్టర్ రమ్య, ఆర్‌ఐ శ్రీనివాసారావు, డాక్టర్ సృజన, అంగన్‌వాడీ టీచర్లు గణపురం కవిత, సుంకోజు రజిత, పస్తం లక్ష్మి , వనజ, బాలమణి, జ్యోతి, విజయలక్ష్మి, కౌసల్య, రజిని, భాగ్యలక్ష్మి, అంజుమ్, సంతోష, ఉషారాణి, కమల, రాములమ్మ, సీసీలు విజయలక్ష్మి, తిరుమల పాల్గొన్నారు.

గండిరామవరంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

నర్మెట, సెప్టెంబర్ 24 : మండలంలోని గండి రామవరంలో మహాజన సోష లిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్, అరుణ ఆధ్వర్యంలో హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించా రు. వైద్యులు నేత్ర వైద్య పరీక్షలతోపాటు ఇతర టెస్ట్‌లు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా గద్దల కిశోర్ మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్యం అందించేందుకు హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థ సహకారంతో శిబిరం నిర్వహించామన్నారు. సంస్థ ఇన్‌చార్జి జయరాజ్, మాజీ సర్పంచ్ జాల శ్వేతా కిషన్, ఎమ్మెస్పీ నాయకుడు చుంచు రాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ సాగర్, చెవుల పరశురాములు, గద్దల ప్రభాకర్, భాస్కర్, బొట్టు రాజేశ్, వెలంగిణి, సందె రవీందర్, కొంపెల్లి అంబేద్కర్, నిర్మల భాస్కర్, గువ్వల రవి పాల్గొన్నారు.

బుగులు వెంకన్న హుండీ ఆదాయం రూ.11.71 లక్షలు

చిల్పూరు, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీలను మంగళవారం తెరిచారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.11,71,350 ఆదాయం సమకూరిందని ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎస్ మోహన్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ భువనగిరి డివిజన్ అధికారి ఎంవీ వెంకట లక్ష్మీ, ఆలయ ప్రధాన అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది కుర్రెంల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

చిల్పూరు,సెప్టెంబర్ 24 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను 26న బాలురకు, 27న బాలికలకు మండలంలోని చిన్నపెండ్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండలం నోడల్ అధికారి దాసరి గోవర్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుడిమల్ల సంపత్ తెలిపారు. వివరాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల కన్వీనర్ జీ చుక్కమ్మ సెల్ నంబర్ 6281329554, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి రవీందర్‌ప్రసాద్ సెల్ నంబర్ 8008109 566కు సంప్రదించాలని సూచించారు.